



# ఇరుగూ పొరుగూ ఆసరా

**మా** ఇంటి వెనకభాగంలో బావికి అవతలగా పెద్ద సావిడి ఉంది. గతంలో దాన్నిండా వ్యవసాయపు పశువులూ పాడీ పశువులూ, ఉండేవట. ఆ తర్వాత ఖాళీగానే పడి ఉంది.

అది బాగుచేయించి మధ్యలో గోడకట్టి రెండు గదులుగా విభజించి ఎవరికైనా అద్దెకివ్వాలని ఆలోచన వచ్చింది అమ్మమ్మకి.

"ఇంతకాలం లేనిది ఇప్పుడీ గొడవ ఎందుకు?" అన్నారు తాతయ్య.

"లంకంత కొంపలో బిక్కుబిక్కుమంటూ నేనొక్కదాన్నీ ఉండలేకపోతున్నాను. ఇంట్లో ఎవరైనా ఉంటే కాస్త కాలక్షేపం" అంది అమ్మమ్మ.

"కాలక్షేపానికి నేనున్నానుగా."

"సర్లెండి. మీకీ మధ్య చెవుడు ఎక్కువ అవుతోంది. 'వస్తారా అంటే ఏమిటి అన్నావు చస్తారా అనా?' అని గయ్యిమంటున్నారు. అవసరానికి నాలుగు మాటలు మాట్లాడేసరికి నా శక్తి అంతా హరించిపోతోంది. ఇక మీతో కబుర్లు చెప్పాలంటే అయినట్లే" అంది ఆవిడ.

"నీకసలే శుచీ శుభ్రం ఎక్కువ. మరో సంసారం వస్తే సర్దుకోగలవో లేదో ఆలోచించు" అన్నారు.

"లేదులెండి. మనం ఇద్దరం పెద్ద వాళ్ళం అయిపోయాం. వెనుక ఎవరైనా ఉంటే మాట సాయం, మనిషి సాయం. మధునా పంతుల వాళ్ళింట్లో అద్దెకి ఉన్న మాస్టరుగారు వాళ్ళని స్వంత బిడ్డల్లా కనిపెట్టి ఉంటున్నారు" అంది అమ్మమ్మ.

మొత్తానికి సావిడిని రెండుగా విభజించి సిద్ధం చేశారు. మరో పదిహేను రోజుల తరవాత శంకరం మాస్టారు అద్దెకి వచ్చారు. శంకరంగారూ, భార్యా, కూతురు గౌరి, చెల్లెలు తులసి.

అంతా కళకళలాడుతున్నారు. 'అద్దె మూడు రూపాయలు' అన్నారు తాతగారు. 'సరే' అన్నారు మాస్టారు.

'వేదాంతంవాళ్ళది పెంకుటిల్లు. అయినా దానికి అద్దె రెండు రూపాయలే. మనది పూరిల్లు, మట్టి గోడలూను. మూడు రూపాయలు లాభసాటి బేరమే' అని ఆనందపడింది అమ్మమ్మ.

మంచిరోజు చూసుకుని వచ్చి చేరారు శంకరం మాస్టారు. తెల్లవారి లేచి వాకిట్లో ముగ్గయినా వెయ్యకముందే వచ్చింది తులసి.

"సామాన్లు ఇంకా విప్పలేదు పిన్నిగారూ! పులుసు గరిటెడు కాఫీపొడి, రెండు పులుసు గరిటెల పంచదార ఇమ్మంది మా వదిన" అంది.

"అయ్యో! దానికేం భాగ్యం. కాఫీ తాగకపోతే కళ్ళు తెరిపిడి పడవు" అంటూ కాఫీపొడీ, పంచదారా పొట్లాలు కట్టి ఇచ్చి పంపించింది.

మేమింకా కాఫీలు తాగకముందే వచ్చింది గౌరి. "ఇల్లు మారుతూ నువ్వుల నూనె వెంట తెచ్చుకోవడం దరిద్రం అని చెప్పిందట మా బోడెత్తయ్య" అంది వాకిలి పట్టుకని నిలబడి.

"నిజమే మరి. మీ బోడెత్తయ్య పద్ధతులు తెలిసిన మనిషి" అంది అమ్మమ్మ.

"అది కాదు. రెండు పెద్ద చెంచాల నువ్వుల నూనె ఇమ్మంది మా అమ్మ. దీపం పెట్టుకుంటుందిట" అంది.

"నిజమే మరి! కొట్టు తీసేదాకా దేవుడి దగ్గర దీపం పెట్టుకోకుండా ఎట్లా ఉంటారు?" అంటూ లేచి చిన్న ఇత్తడి గిన్నెలో నూనె వేసి ఇచ్చింది అమ్మమ్మ.

కాఫీలు తాగి ఇంట్లోకి వచ్చామో లేదో మళ్ళీ పిలిచింది తులసి– "పిన్నిగారూ, పిన్నిగారూ! మా శేషావతారం మామయ్య వచ్చాడు" అంది.

"చాలా సంతోషం. కొత్తింటికి రాగానే చుట్టం రావటం శుభసూచకం."

"అదికాదు. సరుకులింకా తెచ్చుకోలేదు. ఇక్కడినించీ అక్కడికి వెళ్ళేముందు అన్నీ కొనుక్కుని ఎడాపెడా పారబోసుకునే బదులు ఇక్కడన్నీ అవగొట్టుకుని అక్కడికి వెళ్ళి అన్నీ కొనుక్కోవడం లాభదాయకం అంది మా బోడెత్తయ్య" అంది వినయంగా.

"భేష్. మీ బోడెత్తయ్య మంచి తెలివిగలదే" మెచ్చుకుంది అమ్మమ్మ.

"మరి సరుకుల్లేవు. శేషావతారం మావయ్యొచ్చేశాడు. గ్లాసెడు ఉప్మా రవ్వా నాలుగు గరిటెలు వేరుసెనగనూనె, తిరగమోత గింజలూ, రెండు పచ్చిమిరప కాయలు, అల్లం ముక్కా ఇమ్మంది" అంది చిలకలా.

ఆ జాబితా అంతా విని "మరి ఉప్పు మీ ఇంట్లో ఉందా" అని అడిగింది అమ్మమ్మ.

"లేదు పిన్నిగారూ. ఉప్పు అప్పు అడక్కూడదట. మా బోడెత్తయ్య చెప్పింది. మీ తులసి కోట మీద కుండలో ఉందిగా, పట్టుకుపోతాలెండి" అంది.

నోరావలించింది అమ్మమ్మ. అడిగినవన్నీ పోగేసి ఇచ్చి 'అమ్మయ్య' అని కూర్చుంది.

కూర్చునే తీరిక ఏది? శేషావతారం మాయయ్యకి సబ్బు ముక్క వీభూతి పండు, గంధం చెక్కా వంటకి కందిపప్పు, చింతపండూ, విశ్రాంతికి మడత మంచం, మంచినీళ్ళ చెంబూ అంటూ తిరిగిన వాళ్ళూ తిరుగుతూనే ఉన్నారు.

వాళ్ళకవన్నీ ఇచ్చేసరికి అమ్మమ్మకి నీరసం వచ్చింది. నాకూ విసుగొచ్చింది. సూర్యుడు నడినెత్తికి వచ్చాడు. వంటచేసే ఓపికలేక కుంపటి అంటించి ఇంత పులగం వండి రెండు వంకాయలు కాల్చి పచ్చడి చేసి తాతయ్యని భోజనానికి పిలిచింది. కంచంలో పదార్థాలు చూసి –"ఇదేవిటిది? ఇవ్వాళ కార్తీక పౌర్ణమీ, నాగులచవితీ కాదు కదా. నువ్వు ఉపోషమా?" అన్నారు తాతయ్య. ఆవిడ ఉపోసం ఉంటే తాతయ్యకి అదే చేసి పెడుతుంది.

"ఉపోషం కాదూ నా శార్థం కాదూ, శోష వస్తోంది. ఈ కాస్త వండేసరికి తాతలు తలపుకి వచ్చారు. ఈ అద్దెవాళ్ళ పిల్లలు పిశాచాల్లా పీక్కుతింటున్నారు. అప్పటికీ వాళ్ళకి భయపడి దొడ్డితలుపు వేసేశాను. అయినా ఆగితేనా కిటికీలెక్కి గోడలెక్కి అరుస్తున్నారు" అంది.

అంతలోనే వీధి గుమ్మం దగ్గర్నించి 'పిన్నిగారూ' అని పిలిచింది తులసి. అమ్మమ్మ సైగ అందుకుని నేను వెళ్ళి 'అమ్మమ్మ పన్లో ఉంది, ఏం కావాలి' అన్నాను.

"శేషావతారం మావయ్యకి పటికబెల్లం ముక్కా, వక్క పలుకూ ఇమ్మంది."

అవి ఇచ్చి వాకిలి తలుపు కూడా మూసేసి వచ్చేశాను.

"ఇవన్నీ ఇచ్చేబదులు ఆ శేషావతారంగాడిని మనింటికి పిలిస్తే పోయేది. బ్రాహ్మడికి అన్నం పెట్టిన పుణ్యం దక్కేది" అన్నారు తాతయ్య.

"ఇంకా నయం. ఇదే అలుసుగా తీసుకుని చుట్టాలందర్నీ మనింటిమీదికి తోల్తే చచ్చూరుకుంటాం" అంది అమ్మమ్మ.

వాళ్ళు 'పిన్నిగారూ' అని ఇంటి చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకుండా దొంగల్లా ఇంట్లోనే ఉన్నాం కిటికీలూ తలుపులూ మూసుకుని.

మా తాతయ్యకి చెమట పోసింది. విసనకర్ర ఇమ్మన్నారు.

"విసనకర్ర ఆ శనిగాళ్ళు పట్టికెళ్లారు. శేషావతారం మావయ్య విసురుకునేందుకు" అంది అమ్మమ్మ.

"పోనీ ఆ తాటాకుల విసనకర్ర ఇటు పడెయ్" అన్నారు.

"అదీ వాళ్ళే పట్టుకెళ్ళారు. శేషావతారం వీపు గోక్కునేందుకుట."

ఉసూరుమంటూ అంగవస్త్రంతోనే గాలి విసురుకున్నారు తాతయ్య.

"అద్దెకొచ్చి అరపూట కాలేదు. నెల అద్దెకి సరిపడా సామాన్లు లాగేశాడు. ఈ లెక్కన వీళ్ళని భరించగలమా?" అన్నారు.

"ఏదో పెద్ద వయసులో ఇరుగూ పొరుగూ ఉంటే ఆసరాగా ఉంటుందని ఆశపడ్డాను. ఈ తద్దినం మనం భరించలేం. రేపే ఖాళీ చెయ్యమంటాను" అంది అమ్మమ్మ.

మర్నాడు తెల్లవారుతూనే వెళ్ళి వాళ్ళని ఖాళీ చెయ్యమని చెప్పేసింది అమ్మమ్మ.

"కొత్తింట్లో చేరితే ఆర్నెల్లదాకా ఖాళీ చెయ్యకూడదుట. అట్లా చేస్తే ఇంటివారికి అరిష్టం అని చెప్పింది మా బోడెత్తయ్య" అన్నారు ముక్తకంఠంతో.

"చచ్చాం, ఆర్నెల్లు వీళ్ళని భరించాలంటే నా వశమా! నాకున్న ఆ మడిచెక్క కాస్తా కరిగిపోతుంది" అన్నారు తాతయ్య దీనంగా.

* * *